క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

అమలాపురం రూరల్: కిమ్స్ హాస్పటల్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో కామనగరువు పంచాయతీ వద్ద సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ నక్కా అరుణకుమారి ప్రారంభించారు. ప్రోగ్రాం విభాగాధిపతి డాక్టర్ రేణు వసంత్ నేతృత్వంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరుణకుమారి మాట్లాడుతూ వైద్యుల సలహా మేరకు ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ దివ్య, డాక్టర్ ప్రసన్న, పంచాయతీ కార్యదర్శి పి.ఆదినారాయణ, కృష్ణ, సూరిబాబు, కిషోర్, రాజేష్, హెల్త్, కిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం టౌన్: స్థానిక కోర్టుల సముదాయంలో ఈ నెల 29వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ సోమవారం సూచించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, బ్యాంక్, చెక్ బౌన్స్, క్రిమినల్ కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసులు, పలు శాఖలకు చెందిన అధికారులు, కక్షిదారులు పాల్గొనాలని న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ నరేష్ విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ


గంగబాబును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఐ.పోలవరం: మాతృ వియోగంతో బాధపడుతున్న మురమళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ కె.గంగబాబును మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సోమవారం పరామర్శించారు. గంగబాబును ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ఢిల్లీ నారాయణ, ఎస్.ప్రేమ్‌కుమార్, పెన్మత్స వాసురాజు, ఏలూరి ఆదినారాయణ, నడింపల్లి గణపతి మూర్తి వర్మ, సుంకర నాగబాబు తదితరులున్నారు.

మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న అధికారులు

ఉప్పలగుప్తం: నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ప్రారంభించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో వెంకటేశ్వరప్రసాద్ అధ్యక్షత వహించగా మండలంలో ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎటువంటి అర్జీలు రాలేదని ఎంపీడీవో తెలిపారు. డీటీ వైవీపీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా హరీష్ ప్రమాణం


ప్రమాణం చేస్తున్న ఎంపీ హరీష్ మాధుర్

సాక్షి, అమలాపురం: అమలాపురం పార్లమెంట్ సభ్యునిగా గంటి హరీష్ మాధుర్ సోమవారం ప్రమాణం చేశారు. లోక్‌సభలో ఆయన చేత ప్రొటెం స్పీకర్ బి.మహతాబ్ ప్రమాణం చేయించారు. హరీష్ ప్రమాణంతో ఆ కుటుంబం నుంచి ముగ్గురు ఎంపీలుగా గెలిచిన అరుదైన ఘనత సాధించారు.

వేదాంత కంపెనీలో ఉద్యోగాలివ్వాలి

కలెక్టరేట్ వద్ద ఎస్.యానం గ్రామస్తుల ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్.యానం గ్రామస్తులు

అమలాపురం రూరల్: వేదాంత ఆయిల్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించాలని ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. తమ గ్రామం నుంచి గత 30 ఏళ్లగా వేదాంత రవ్వ ఆయిల్ కంపెనీ వేల కోట్ల రూపాయల సంపదను తరలించుకుపోతుందన్నారు. గ్రామ ప్రజలకు కంపెనీలో ఉపాధి కల్పించాలని అనేక దఫాలుగా ఆందోళన బాట పట్టామన్నారు. ఏడాదికి 25 చొప్పున మూడేళ్లలో 75 ఉద్యోగాలు ఇస్తామని 2024 ఫిబ్రవరి 22, 29 తేదీల్లో అప్పటి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, రెవెన్యూ పోలీస్ ఉన్నతాధికారుల సమక్షంలో వేదాంత ఆయిల్ కంపెనీ ఉన్నతాధికారులు హామీ ఇచ్చి తీర్మానం చేశారన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయిందని ఇప్పుడు ఆ హామీని నెరవేర్చాలని నిరుద్యోగ యువకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పందించి వారం రోజుల్లో వేదాంత కంపెనీ యాజమాన్యాన్ని పిలిపించి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సమక్షంలో చర్చలు జరిపి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, ఉండ్రు శామ్యూల్, పి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలను తక్షణమే చెల్లించాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

అమలాపురం రూరల్: కౌలు రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని నిరసిస్తూ కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నుపూర్ అజయ్‌లకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారి వెంకటేశ్వరరావు, కార్యదర్శి పీతల రామచంద్రరావులు మాట్లాడుతూ రబీ సీజన్లో పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ప్రభుత్వం ఆ ధాన్యానికి బకాయిలు చెల్లించలేదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అప్పుల భారం తట్టుకోలేక పంటలు పండించలేక కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో ప్రధాన పంట కాలువలు మురుగు డ్రైన్లుగా తయారయ్యాయని పూడిక తీతలు తీయించాలని కోరారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు బ్యాంకుల ద్వారా ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు ఋంగ సత్యనారాయణ, అలిశెట్టి హరిబాబు, తాటికాయల ఉదయభాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాడి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి తీరుపై సిబ్బంది ఫిర్యాదు

తాళ్లరేవు: స్థానిక 30 పడకల సామాజిక ఆస్పత్రిలో పిల్లల వైద్యురాలిగా సేవలందిస్తున్న స్నేహలత తీరుపై పలువురు సిబ్బంది ఆస్పత్రి సూపరింటెండెంట్ శిరీషకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజులుగా వైద్యురాలు స్నేహలత తమపై దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషిస్తున్నారని ఆస్పత్రి స్టాఫ్ నర్స్ సునీత, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ శాంత ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల టెస్ట్‌లు అందుబాటులో ఉన్నా బయట ప్రైవేట్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకు రావాలని రోగులకు రాస్తున్నారన్నారు. ఆస్పత్రిలో పరీక్షలు చేయకుండా బయటకు ఎందుకు పంపిస్తున్నారని రోగులు తమను ప్రశ్నిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎటువంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వాలని వైద్యురాలు స్నేహలత ఒత్తిడి చేస్తున్నారని ఇవ్వకపోతే తమపై విరుచుకు పడుతున్నారన్నారు. వైద్యురాలి తీరుతో ఆస్పత్రిలో విధులు నిర్వహించలేకపోతున్నామని తగిన చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ శిరీషను విలేకర్లు వివరణ కోరగా వైద్యురాలు స్నేహలత వైఖరిపై ఇద్దరు రాత పూర్వకంగా, మరో నలుగురు మౌఖికంగా ఫిర్యాదు చేశారన్నారు. స్టాఫ్ నర్స్ ఇవాంజిలినా, పోస్టుమార్టమ్ అసిస్టెంట్ శివకుమారి, రేడియోగ్రాఫర్ ప్రభాకర్, లావణ్య తదితరులు స్నేహలత వేధిస్తున్నారని చెప్పారని ఈ విషయాలను ఇప్పటికే జిల్లా వైద్య శాఖాధికారి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

వ్యాపారాలు చేసేవారంతా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సిందే

స్పష్టం చేసిన మున్సిపల్ కమిషనర్ మనోహర్


మున్సిపల్ కమిషనర్ మనోహర్‌తో చర్చిస్తున్న వ్యాపార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణంలో వ్యాపారాలు చేసేవారంతా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సిందేనని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ స్పష్టం చేశారు. ఇటీవల ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోని వ్యాపారులకు మున్సిపాలిటీ నోటీసులు ఇచ్చిన క్రమంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు కమిషనర్ మనోహర్‌ను సోమవారం స్వయంగా కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోహర్ ట్రేడ్ లైసెన్స్‌ల ప్రాధాన్యతపై వ్యాపార ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. పట్టణంలో షాపులకు కొలతలు కొలిచి ట్రేడ్ లైసెన్స్‌లు ఇచ్చే విధానం వద్దని, షాపునకు మాత్రమే లైసెన్స్ విధించే విధానం అమలు చేయాలని చాంబర్ అధ్యక్షుడు తాతాజీ కమిషనర్‌ను కోరారు. అలాగే పట్టణంలో పలు వ్యాపారులకు ఆయా దుకాణాల వద్ద తగిన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపాలిటీ రెవెన్యూ అధికారి శిరిగినీడి శివాజీ, చాంబర్ ప్రతినిధులు కుప్పాల రామకృష్ణ, నిట్టాల శ్రీరామ్, యర్రా సతీష్, యెండూరి చంటి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ముమ్మిడివరం: యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ముమ్మిడివరం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే ముమ్మిడివరం ఎస్ఐ బి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు అన్నంపల్లి టోల్ గేటు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా మామిడికుదురుకు చెందిన ప్రేమ్‌రాజ్ 9 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లతో పట్టుబడ్డాడు. అతడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ బి.సురేష్‌బాబు తెలిపారు.

జీజీహెచ్‌కు ఎట్టకేలకు కొత్త ఫ్రీజర్ బాక్స్


జీజీహెచ్‌కు చేరుకున్న నూతన ఫ్రీజర్ బాక్స్

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో ఉండే మృతదేహాలను భద్రపరిచేందుకు పుదుచ్చేరి ఆరోగ్య శాఖ కొత్త ఫ్రీజర్ బాక్స్‌ను సమకూర్చింది. ఆసుపత్రిలోని ఫ్రీజర్ బాక్స్ పాడైపోవడంతో కొన్ని నెలలుగా వినియోగానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో మృతదేహాలను వారి కుటుంబసభ్యులు ఐస్ తెచ్చుకుని భద్రపరచుకునే దుస్థితి ఏర్పడింది. ఇటీవల ఒక బాలుడి మృతదేహం భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటుచేయాలని స్థానిక యువకులు నిరసనకు దిగారు. సమస్య తీవ్రతను స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుదుచ్చేరి ఉన్నతాధికారి శ్రీరాములుకు తెలియజేశారు. ఎట్టకేలకు ఫ్రీజర్ బాక్స్ సమకూర్చడంతో సామాజికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అల్లవరం: వార్షిక మరమ్మతుల కారణంగా మండలంలోని దేవగుప్తం, అల్లవరం, బెండమూర్లంక సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి


అల్లవరంలో ఓహెచ్ఆర్ ట్యాంక్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న డీడీఓ వీరాస్వామి

అల్లవరం: వర్షాకాలంలో గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీడీఓ వీరాస్వామి అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మండలంలోని అల్లవరం, గోడిలంక గ్రామాల్లో పర్యటించారు. తొలుత అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్లోరినేషన్ చేసిన తరువాతే ప్రజలకు తాగునీటిని పంపిణీ చేయాలని, పైపు లైన్లు లీకేజీ లేకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనంతరం సచివాలయంలో రికార్డులను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏఓ లక్ష్మణరావు, కార్యదర్శులు ఎన్‌వీవీ సత్యనారాయణ, రాజమోహన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన అప్రోచ్‌లు


వాసాలతిప్ప గ్రామంలో ప్రమాదకరంగా మారిన వంతెన అప్రోచ్‌లు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధి వాసాలతిప్ప గ్రామంలో నదీపాయపై ఉన్న వంతెనకు ఇరువైపులా రహదారి ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా అనుసంధానంగా ఉన్న అప్రోచ్‌లు రెండు మీటర్ల వెడల్పు, మీటరు లోతున కుంగిపోయాయి. వాసాలతిప్ప, అల్లవరం మండలం నక్కా రామేశ్వరం తదితర మత్స్యకార గ్రామాలకు చెందిన ప్రజలు అమలాపురం చేరుకోవాలంటే ఈ వంతెన మీదుగానే ప్రయాణించాలి. ఈ వంతెన అప్రోచ్‌లు ప్రమాదకరంగా మారడంతో రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఫ్రెంచి చానల్‌ను ఆధునీకరించాలి


ఫ్రెంచి చానల్‌ను ఆధునీకరించాలని ఆర్ఏఓ ఆఫీసుకు వచ్చిన రైతులు

యానాం: సాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా ఫ్రెంచి చానల్‌ను ఆధునీకరించే పనులు చేపట్టాలని దరియాలతిప్ప రైతు సంక్షేమ సంఘం నాయకులు తిరుకోటి నాగేశ్వరరావు, మెల్లం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం పలువురు రైతులు స్థానిక ఆర్ఏఓ మునిస్వామికి సమస్యపై వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పలుసార్లు పీడబ్ల్యూడీ అధికారులకు సమస్యపై విన్నవించినా స్పందించలేదన్నారు. ఆర్ఏఓ మునిస్వామి మాత్రం స్పందించి త్వరలోనే టెండర్ ప్రక్రియ చేపట్టి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ వచ్చిన వెంటనే రైతులకు చెల్లించాల్సిన సొమ్ముల పంపిణీ సైతం జరుగుతుందని తెలిపారన్నారు. ట్రాక్టర్లు, పవర్‌టిల్లర్లు వంటి వ్యవసాయ సామగ్రి ఇప్పించాలని కోరామన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు


డీఈఓ మోకా ఉమకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, పీఎంసీ చైర్మన్ రాము

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెం స్కూల్ హెచ్‌ఎం సునీల్ ప్రొటోకాల్ ఉల్లంఘించారంటూ ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీనివాస్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పలివెల రాము జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖాధికారి, మండల విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీనివాస్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సుంకరపాలెం ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 22వ తేదీన సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారన్నారు. అయితే స్థానిక ఎంపీటీసీ సభ్యుడినైన తనకు గాని, సంబంధిత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పలివెల రాముకు గాని సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ ఉల్లంఘించారన్నారు. దీనిపై స్కూల్ హెచ్‌ఎం సునీల్‌ను తాను ప్రశ్నించగా సమాధానం చెప్పకుండా అవమానించారన్నారు. అందుకే ఆయనపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, డీఈఓ, ఎంఈఓలకు ఫిర్యాదు చేశామన్నారు.

గడువును సద్వినియోగం చేసుకోవాలి


మోరి వీ కన్వెన్షన్ హాల్‌లో మాట్లాడుతున్న కుడుపూడి సూర్యనారాయణరావు

సఖినేటిపల్లి: స్వచ్ఛందంగా కువైట్ దేశం విడిచి వెళ్లేందుకు ఆ దేశం రాజు ఇచ్చిన గడువును అక్కడ చిక్కుకుపోయిన బాధిత కుటుంబ సభ్యులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, సీనియర్ అడ్వొకేట్ కుడిపూడి సూర్యనారాయణరావు సూచించారు. ఆదివారం రాత్రి మోరి వీ కన్వెన్షన్ హాల్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, సీనియర్ అడ్వొకేట్ కుడిపూడి సూర్యనారాయణరావు ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కువైట్ ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ లోపు ఎటువంటి కాగితాలు, ఆధారాలు లేకపోయినా ఆ దేశంలో చిక్కుకుపోయిన వారు దేశం విడిచి వెళ్లిపోవచ్చని క్షమాభిక్ష ఇప్పటికే ప్రకటించిందన్నారు. అయితే కువైట్‌లో భాష రాక, పేపర్లు చదువుకోలేక, అమాయకత్వంతో అక్కడ చిక్కుకుని ఉన్నవారు కువైట్ రాజు ఇచ్చిన గడువు అవకాశం సద్వినియోగం చేసుకోలేని స్థితిలో ఉన్నారని ఆయన అన్నారు. ఈ కోవకు చెందిన వారి కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని, బాధిత కుటుంబ సభ్యుల చొరవతో సదరు వ్యక్తులను గడువులోగా స్వగ్రామాలకు రప్పించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బాబీ గాబ్రియల్, ఓగూరి ఆక్రోష్, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించండి

రాజోలు: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లల్ని చేర్పించాలని మండల పరిషత్ అధ్యక్షుడు కేతా శ్రీనివాస్ అన్నారు. సోమవారం పొన్నమండ ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల్లో అందిస్తున్న సౌకర్యాలను ప్రధానోపాధ్యాయిని ఆరుమిల్లి రోహిణి వివరించారు. స్టూడెంట్ కిట్, పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకం వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. బడి బయట ఉన్న పిల్లల్ని కచ్చితంగా పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు నల్లి మనోహరం, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ బోట్ల క్షేత్ర స్థాయి పరిశీలన


తాళ్లరేవులో బోటును పరిశీలిస్తున్న మత్స్యశాఖ అధికారులు

తాళ్లరేవు: సముద్రంలో చేపల వేట చేసే ఫిషింగ్ బోట్ల క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాన్ని మత్స్యశాఖ అధికారులు సోమవారం చేపట్టారు. మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మత్స్యశాఖ సిబ్బంది ఫిషింగ్ బోట్ల వివరాలు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బోటు లైసెన్స్, బోటు కొలతలు, కలర్ కోడ్, లైఫ్ సేవింగ్, ఇంజిన్ తదితర వివరాలను స్వయంగా పరిశీలించి ఫొటోలతో రియల్ క్రాఫ్ట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు తాళ్లరేవు మండల మత్స్యశాఖాధికారి జి.గోపి తెలిపారు. పరిశీలనకు మత్స్యకారులు, బోటు యజమానులు సహకరించాలని ఆయన కోరారు.

బెల్లంపూడిలో విజృంభిస్తున్న విష జ్వరాలు

పి.గన్నవరం: మండలంలోని బెల్లంపూడి అంబేడ్కర్ కాలనీలో గత కొన్ని రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వర పీడితులు పి.గన్నవరం, అమలాపురం ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సోమవారం పి.గన్నవరం సీహెచ్‌సీలో పలువురు చికిత్స చేయించుకున్నారు. సుమారు 20 మందికి పైగా జ్వరాల బారిన పడినట్టు స్థానికులు తెలిపారు. కాలనీలో కొన్ని రోజులుగా జ్వరాలు తగ్గక పోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. జ్వర పీడితులకు ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో ఆర్.శ్రీనివాస్ అనే వ్యక్తిని అమలాపురం కిమ్స్ ఆస్పత్రి చేర్పించారు. అలాగే పి.గన్నవరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో ఇమ్మానుయేలు, బాలకృష్ణ, శృతి, విజయరాజు, శిరీషలు చికిత్స పొందుతున్నారని కాలనీ వాసులు తెలిపారు. వైద్య అధికారులు స్పందించి జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజల కోరుతున్నారు.

పది గ్రామాల్లో సామాజిక తనిఖీలు

అయినవిల్లి: మండలంలోని పది గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో 2023–24లో జరిగిన పనుల పై సోమవారం సామాజిక తనిఖీల బృందం తనిఖీలు నిర్వహించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ వి.కనకరావు ఆధ్వర్యంలో డీఆర్‌పీల పర్యవేక్షణలో పది బృందాలుగా ఏర్పడి విలేజ్ సోషల్ ఆడిటర్స్ సాయంతో పోతుకుర్రు, శంకరాయగూడెం, మడుపల్లి, చింతనలంక, వెలువలపల్లి, నల్లచెరువు, మాగాం, వీరవల్లిపాలెం గ్రామాల్లో క్షేత స్థాయిలో తనిఖీలు చేశారు. తనిఖీల్లో వెలువడిన అంశాలను నివేదికల ద్వారా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసి ప్రజా ప్రతినిధులకు, అధికారులను వివరిస్తామన్నారు.

పొగతో ఇక్కట్లు


ఉప్పలగుప్తంలో నివాసాలకు దగ్గరలో తగులబెట్టిన చెత్త

ఉప్పలగుప్తం: మండలంలోని స్థానిక గ్రామంలో పంచాయతీ సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టడంతో స్థానికంగా ఉన్న ప్రజలు పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పరిధిలో రోజూ చెత్తను తీసుకొచ్చి నిప్పు పెట్టడంతో స్థానిక నివాసితులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టి సారించి తమకు ఈ పొగ నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


విద్యార్థులకు నగదు అందజేస్తున్న డాక్టర్ రమణకుమార్ దంపతులు, హెచ్‌ఎం గోపాలరాజు

కొత్తపేట: ప్రాథమిక స్థాయి నుంచీ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అమలాపురానికి చెందిన ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ కొప్పినీడి వెంకటరమణకుమార్ విద్యార్థులకు ఉద్బోధించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, పలివెల గ్రామానికి చెందిన యర్రాప్రగడ సుబ్రహ్మణ్యం, శేషమాణిక్యాంబ దంపతుల కుమారులు తమ తండ్రి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ఏటా స్థానిక ప్రభుత్వ బాలురు, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల నుంచి పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.25 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నారు. బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఎలుగుబంటి రోహిత్ వెంకట్, బాలికల పాఠశాల నుంచి యజ్ఞిత ఉత్తమ ఫలితాలతో ప్రథమ స్థానాలు సాధించారు. వారికి నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు డాక్టర్ రమణకుమార్ దంపతుల చేతుల మీదుగా నగదు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎన్.సత్యనారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు జేవీ సోమయాజులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.